

లింగ నిర్ధారణ నేరం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ శనివారం హెచ్చరించారు.

- 10లో



పార్టీలు చూడం.. అర్హతే ప్రామాణికం

సంక్షేమ పథకాల అమలులో పార్టీలు చూడమని, అర్హతే ప్రామాణికమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు.

- 10లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	26
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

రూ.44.50లకే కేజీ సోనామసూరి



బియ్యం విక్రయాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు రూరల్: బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రజలకు ఇబ్బంది లేకుండా కిలో సోనామసూరి బియ్యం రూ.44.50లకే అందజేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఇందుకోసం రైతు బజార్లు, మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక విక్రయ కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. శనివారం ఈ మేరకు చిత్తూరు రైతు బజార్‌లో జిల్లా పౌరసరఫరాశాఖ ఏర్పాటు చేసిన బియ్యం కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేడు 7 కౌంటర్లను ప్రారంభించామని, చిత్తూరు రైతు బజార్‌లో ఒకటి, పులిచెర్ల మండలం కల్లూరులో రెండు, నగరిలో రెండు, పలమనేరులో రెండు కౌంటర్లను తెరిచినట్ల వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శంకరన్, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ పాల్గొన్నారు.

జిల్లాకు 6వేల విద్యుత్ మీటర్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు 6 వేల సింగిల్ ఫేస్ విద్యుత్ మీటర్లు వచ్చినట్లు ట్రాన్స్‌కో ఈఈ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 32, 63 కేవీ 14, 160 కేవీ 10 వచ్చాయని వెల్లడించారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి జిల్లా స్టోర్ నుంచి మెటీరియల్ తీసుకోవాలని సూచించారు.

'ఐలు' నూతన కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు అర్బన్: ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వి.సురేంద్రకుమార్, అధ్యక్షుడిగా ఇ.సుగుణశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీజీ గోపి, ప్రధాన కార్యదర్శిగా టీకే శ్రీనివాసబాబు, కార్యదర్శిగా ఎంబీ స్వరూపలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా మొహిద్దీన్, బీఆర్ హరిబాబునాయుడు, జూనియర్ ఇన్‌చార్జిలుగా వీఆర్ వాసుదేవరెడ్డి, ఎం.వాసు, మహిళా ప్రతినిధిగా వి.నళిని, కోశాధికారిగా కె.గోమతి, కార్యనిర్వాహక సభ్యులుగా డీసీ వెంకటరమణ, కె.కోమల, ప్రియదర్శిని, ఎస్.వెంకటేష్ ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర నేతలు మురళి, దేవరాజులు, వెంకటయ్య ప్రకటించారు.

బాల నేరస్తుల హక్కుల రక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: నగరంలోని న్యాయసేవాసదన్‌లో శనివారం బాల నేరస్తుల హక్కుల పరిరక్షణపై పోలీసు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో బాలలు చేసే తప్పులు వారి భవిష్యత్‌ను నిర్ణయించేలా ఉండకూడదని తెలిపారు. 18 ఏళ్లలోపు వారిని పోలీసులు అదుపులోకి తీసుకునేప్పుడు తప్పనిసరిగా బాలల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. తిరుపతిలోని జువైనెల్ బోర్డుకు కేసులను పంపాలన్నారు. ఇక బాల నేరస్తుల వేలిముద్రలు, ఫొటోలను కేసు విచారణ సమయంలో మాత్రమే వాడాలని, ఎక్కడా బహిర్గతం చేయకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో జువైనెల్ న్యాయమూర్తి సంధ్యారాణి, తిరుపతి దిశ డీఎస్పీ కాటమరాజు పాల్గొన్నారు.

రాయితీ టమాట రెడీ..!

టమాట ధర భారీగా పెరిగింది. మార్కెట్‌లో కేజీ రూ.100కు పైగా పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో రూ.150 దాటుతోంది. సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో రాయితీపై టమాటాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. రైతు బజార్‌లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. నిత్యం సుమారు 3 టన్నులను అందుబాటులోకి తీసుకు వస్తోంది. సబ్సిడీపై రూ.50లకే కేజీ టమాటాలను విక్రయిస్తోంది.

- రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- నిత్యం 3 టన్నులు సరఫరా
- మార్కెట్‌లో కేజీ రూ.112లకు కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- కేజీ రూ.50లకే విక్రయం
- బారులుతీరుతున్న జనం



టమాట అందజేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ : జిల్లాలోని పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టమాట అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. ప్రస్తుతం 4వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉన్నందున మరో 5వేల హెక్టార్లలో టమాట సాగులోకి వచ్చే అవకాశముందని ఉద్యానశాఖ వెల్లడిస్తోంది. ఈ మేరకు జిల్లాలోని మార్కెట్‌లలో ప్రతిరోజు 400 నుంచి 500 టన్నుల వరకు టమాట క్రయ విక్రయాలు సాగుతున్నాయి. జిల్లాలో 100 నుంచి 150 టన్నుల వరకు వినియోగిస్తున్నారు. మిగిలిన టమాటాలను పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటీవల ఇక్కడ టమాటాలకు డిమాండ్ బాగా పెరిగింది. నిత్యం జిల్లా వ్యాప్తంగా 100నుంచి 150 టన్నుల వరకు టమాట సరఫరా కాగా మిగిలిన టమాట దేశవ్యాప్తంగా ఎగుమతి అవుతోంది. ఇక 5వేల హెక్టార్లలో పంటసాగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

డిమాండ్ ఇలా..

గత ఏడాది జూలై నుంచి 8నెలల పాటు టమాటకు రేట్లు లేవు. దీంతో రైతులు వేసవికాలంలో టమాట సాగును తగ్గించుకున్నారు. మార్చిలో కురిసిన వర్షాల కారణంగా 650 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. ఏప్రిల్‌లో ఎండ తీవ్రతకు కొన్ని చోట్ల పంట దెబ్బతింది. ఈ కారణంగా టమాట సాగు జిల్లాలో తగ్గుముఖం పట్టింది. అలాగే కర్ణాటకలోని కోలార్‌లో కూడా పంట సాగు విస్తీర్ణం పడిపోయింది. దీంతో పాటు కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్, తమిళనాడు, మహారాష్ట్రలో కూడా వర్షాల కారణంగా టమాట పంట దెబ్బతింది. అవసరాలకు తగ్గట్టు సరఫరా తగ్గిపోయింది. దీంతో టమాట ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం పలు రాష్ట్రాల వ్యాపారులు జిల్లాలోని పలమనేరు, పుంగనూరు మార్కెట్‌కు వచ్చి టమాట కొనుగోలుకు పోటీపడుతున్నారు. నిత్యం 300 నుంచి 350 టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో కేజీ టమాట ఏ రకం రూ.140, బీ రకం రూ.90, సీ రకం రూ.80 లెక్కన మార్కెట్‌లో రేటు పలుకుతోంది. వారం క్రితమైతే కేజీ రూ.150 నుంచి రూ.200 వరకు అమ్మకాలు సాగినట్లు మార్కెట్ అధికారులు వెల్లడిస్తున్నారు.

సబ్సిడీపై ఇలా..

టమాట ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు కొనేందుకు జంకుతున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో టమాట విక్రయించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈనెల 5వ తేదీ నుంచి ముందుగా చిత్తూరు రైతు బజారులో రాయితీపై టమాట విక్రయాలకు శ్రీకారం చుట్టింది. నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 7.30 నుంచి విక్రయాలు ప్రారంభించింది. ఒక్కొక్కరికి కేజీ రూ. 50 చొప్పున ఒకటి నుంచి రెండు కేజీల వరకు అందజేస్తున్నారు. ప్రతిరోజూ రైతు బజారుకు 3 టన్నుల టమాట సరఫరా కాగా మూడు వేల మందికి పైగా కొనుగోలు చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం పలమనేరు మార్కెట్‌లో కేజీ టమాటను రూ.112 కొనుగోలు చేస్తోంది. ప్రజలకు రాయితీతో రూ. 50లకే అందజేస్తుండడంతో ప్రభుత్వంపై అదనంగా రూ. 3.50 లక్షల భారం పడుతోంది. ఈలెక్కన్న గత 10 రోజులకు గాను రూ.35 లక్షలు వెచ్చించినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. రాయితీ టమాటాలను కొనుగోలు చేసేందుకు ఉదయం నుంచే ప్రజలు పెద్దసంఖ్యలో బారులు తీరుతున్నారు. సరుకు బావుండడంతో గంటల కొద్దీ క్యూలో వేచి ఉండి మరీ టమాటాలను తీసుకుంటున్నారు. అధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు.

మంచివి ఇస్తున్నారు



ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న టమాట బాగున్నాయి. మంచివి ఇస్తున్నారు. ఈ రకం బయట మార్కెట్లో రూ. 150 చెబుతున్నారు. అక్కడ కొనలేని పరిస్థితి. సబ్సిడీపై ఇవ్వడంతో మాకు ఆనందంగా ఉంది. ఇలా ధరలు పెరిగినప్పుడల్లా మాకు అండగా ఉంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– తేజోవతి, చిత్తూరు

సకాలంలో గుర్తించింది



ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా టమాట వంద రూపాయలు దాటుతోంది. 10రోజులకు క్రితం టమాట ధరలు చూసి కొనేందుకు చాలా ఇబ్బందిపడ్డాం. ప్రభుత్వం ప్రజల ఇక్కట్లను సకాలంలో గుర్తించింది. రాయితీపై టమాటాలను పంపిణీ చేయడం ఎంతో ఊరటనిచ్చింది.

– పురుషోత్తం, చిత్తూరు

అభిమానం క్షీరాభిషేకమై..



ముఖ్యమంత్రి, మంత్రి, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

చౌడేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటాలకు చౌడేపల్లె అంబేడ్కర్ భవన్ నిర్మాణ కమిటీ సభ్యులు శనివారం క్షీరాభిషేకం చేశారు. కమ్యూనిటీ భవనం పై అంతస్తు నిర్మాణానికి జెడ్పీ నుంచి రూ.45లక్షలు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించనున్నట్లు వెల్లడించారు. దళితుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిబాబు, నేతలు బ్యాంకు రెడ్డెప్ప, శ్రీరాములు, శంకరప్ప, వేణు, వాసు, డిష్ సూరి, హరి ప్రసాద్, రవి, విజయ్‌కుమార్, యోగానంద, సుధాకర్, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనమవుతోంది. టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

'సహకార'ం.. మరింత బలోపేతం



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ

చిత్తూరు అగ్రికల్చర్: సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ తెలిపారు. శనివారం నగరరంలోని డీసీసీబీ కార్యాలయంలో బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. రెడ్డెమ్మ మాట్లాడుతూ సహకార సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.3వేల కోట్ల వ్యాపారమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా రూ.వెయ్యి కోట్ల డిపాజిట్ల సేకరణ, రూ.2వేల కోట్ల రుణాల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 2022–23 ఆర్థిక సంవత్సరం బ్యాంకు వార్షిక నివేదికను మహాజన సభ ఆమోదించింది. ఆదాయం రూ. 11.18 కోట్లు , డిపాజిట్లు రూ.857.15 కోట్లు, రుణాలు రూ. 1,563.91 కోట్లతో బ్యాంకు ప్రగతి పథంలో పయనించిందని చైర్‌పర్సన్ వెల్లడించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 6 శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. సీఈఓ మనోహర్ గౌడ్, సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్ : పోలీసుల సంక్షేమానికి శాఖాపరంగా ప్రాధాన్యమిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం చిత్తూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నదని, ఏఆర్ విధుల నిర్వహణ కష్టతరమైందని తెలిపారు. ఎస్కార్టులు, బందోబస్తులు, గన్‌మన్ విధులను జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఇందుకోసం శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఏఆర్ పోలీసులు క్రమశిక్షణకు మారుపేరులా ఉండాలని స్పష్టం చేశారు. ఏఆర్, హోంగార్డులతో ప్రతి శనివారం ప్రత్యేక జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో శాఖాపరంగా ఎదురయ్యే తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించిన సందర్భంగా విశిష్టంగా విధులు నిర్వర్తించడంపై సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్, నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధు పాల్గొన్నారు.

'నేతన్న నేస్తం'.. విజయవంతం చేద్దాం

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి
- అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయండి
- వెంకటగిరిలో సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు

సాక్షి, తిరుపతి: నేతన్న నేస్తం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం నగదును కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేయనున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం సమావేశమయ్యారు. అంతకుముందు ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి సభాస్థలి, హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనకు సంబంధించి పకడ్బందీగా అధికారులకు విధులు కేటాయించామని కలెక్టర్ వివరించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ స్టేజ్ ఏర్పాటు, బహిరంగ సభకు వచ్చిన ప్రజలకు తాగునీరు, అల్పాహారం, రవాణా, మెడికల్ క్యాంపు , అంబులెన్స్, 108, ఫొటో గ్యాలరీ, బ్యాక్ డ్రాప్, ఎల్ఈడీ స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కళాజాతా, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలన్నారు. అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశానికి వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు మేరుగ మురళి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, జేసీ డీకే బాలాజీ, డీఎంహెచ్ఓ శ్రీహరి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌పై పోక్సో కేసు

రామకుప్పం: కుప్పం మండలం వేపూరుకు చెందిన చంద్రశేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు రామకుప్పం ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. వివరాలు..మండలంలోని ఆనిగానూరుకు చెందిన బాలిక(16) జూన్ 18వ తేదీన కిడ్నాప్‌కు గురైనట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రాత్రి చంద్రశేఖర్ ఇంట్లో బాలికను గుర్తించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలిక వాంగ్మూలం మేరకు చంద్రశేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిశుభ్ర పల్లెలకు 'స్వచ్ఛ' అవార్డులు

చిత్తూరు కార్పొరేషన్: పరిశుభ్రమైన పల్లెలకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ గ్రామీణ్ అవార్డులు అందించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలను స్వచ్ఛ అవార్డులకు పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీల నిర్వహణ తదితర అంశాలను కేంద్రబృందం క్షేత్రస్థాయిల పరిశీలించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రూ.5లక్షల కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

గంగవరం : బెంగళూరు జాతీయ రహదారిపై క్యాటిల్‌ఫారం వద్ద శుక్రవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.5లక్షల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బైరెడ్డిపల్లె మండలానికి చెందిన చరణ్, హరీష్, లోకేష్ అనే వ్యక్తులు కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి ఇక్కడ విక్రయించేవారన్నారు. ఈ క్రమంలో చరణ్, లోకేష్ 41 కేసుల టెట్రా ప్యాకెట్లను రెండు కార్లతో తీసుకువస్తుండగా ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో నిందితుడు హరీష్ పరారైనట్లు వివరించారు.

నెలరాజా ఇటు చూడవా!



- ఎల్‌వీఎం3-ఎం4 ప్రయోగం విజయవంతం ● పూర్తయిన మొదటి ఘట్టం
- లూనార్‌ను ఆర్బిట్‌లోకి పంపడమే రెండో ఘట్టం
- ఆగస్టు 23న చంద్రుడిపై ల్యాండర్‌ని దించడమే ముందున్న లక్ష్యం ● అప్పుడే పూర్తి స్థాయి విజయం

భూమ్మీద జీవకోటికి చల్లని వెలుగునిచ్చే నెలరాజుతో జట్టుకట్టాలని.. జాబిల్లి రహస్యాలు ఛేదించాలని.. 'మామ'గుట్టును కనిపెట్టాలని.. ఉవ్విళ్లూరుతూ రివ్వున ఎగిరిపోయిన చంద్రయాన్-3 మిషన్ ప్రయోగ మొదటి ఘట్టం దిగ్విజయంగా పూర్తయింది. రాకెట్‌లో అమర్చిన పరికరాలు భూ స్థిర నిర్ణీత కక్ష్యలో విజయవంతంగా చేరి పరిభ్రమిస్తున్నాయి. తదుపరి రెండో ఘట్టంలో 17 రోజుల పాటు పయనించి చంద్రుని కక్ష్యలోకి చేరనున్నాయి. ఆగస్టు 23న అసలుసిసలైన మూడో ఘట్టానికి తెరలేపనున్నాయి. చంద్రుడిపై ల్యాండర్‌ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన 4 గంటల తర్వాత రోవర్ బయటకొచ్చి తన పరిశోధన మొదలు పెట్టనుంది. ఈ రెండు ప్రక్రియలు పూర్తయితే ప్రపంచ పటంలో భారత్ శిఖరాగ్రన నిలవనుంది. ఇస్రో ఖ్యాతి జగద్విఖ్యాతమై విరాజిల్లనుంది.

- సూళ్లూరుపేట



రోదసీలో చంద్రయాన్-3 మిషన్




చంద్రుడి కక్ష్యలో ల్యాండర్‌ను విడుదల చేస్తూ..




చంద్రుడి ఉపరితలంపై దించేందుకు మండిస్తూ..



ల్యాండర్ నుంచి బయటకు వస్తున్న రోవర్



చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు చేస్తున్న రోవర్



వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత

- పది మంది అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మద్దయ్య ఆచారి

చిత్తూరు అర్బన్/ వి.కోట : జిల్లాలోని చిత్తూరు నగరం, వి.కోట మండలంలో పోలీసులు శనివారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్ట్ చేశారు. వివరాలు.. చిత్తూరులోని ఓబనపల్లె, తంగవేలు, జానకారపల్లె కాలనీలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 4.5కేజీల గంజాయిని సీజ్ చేశారు. గంజాయిని విక్రయిస్తున్న ఓబనపల్లెకు చెందిన కుమార్(42), గణేష్(42), ధనమ్మ (53), జానకాపల్లెకు చెందిన వల్లియమ్మ(65), మార్కు (38), సంతపేటకు చెందిన కుప్పన్(34), కార్తీక్ (30)అనే నిందితులను అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించారు. గంజాయి విక్రేతలపై అవసరమైతే పీడీ యాక్టులను అమలు చేయనున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి హెచ్చరించారు. అలాగే చిత్తూరులోని మిట్టూరు రెడ్‌క్రాస్ వీధికి చెందిన లక్ష్మి అనే మహిళ గంజాయి విక్రయిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి 1.750 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వి.కోట మండలం వెర్రినాగేపల్లెలో గంజాయి విక్రేతలు నవీన్, రాజప్పను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 3 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మనోహర్ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

యాదమరి: పలు చోరీల కేసుల్లో నిందితుడుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సుమన్ శనివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని 184 గొల్లపల్లెలో జయరామ్ అనే వ్యక్తి ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వేలిముద్రల ఆధారంగా తమిళనాడులోని వేలూరు జిల్లా పేర్నంబట్‌లోని మదినేపల్లెకు చెందిన మురళి(27)ని నిందితుడిగా గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా గొల్లపల్లెతోపాటు వి.కోట, బంగారుపాళ్యంలో మురళి పలు చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. నిందితుడి నుంచి 120 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నారు.